సాక్షి
హైదరాబాద్, శనివారం, 5, అక్టోబర్, 2024

నేడు మాతారాణికా విశాల్ జాగరణ్



జియాగూడ: ధూల్‌పేట్ నవరాత్రి ఉత్సవ సమితి ద్వారా ఈనెల 5న సాయంత్రం 16వ వార్షికోత్సవ మాతారాణికా విశాల్ జాగరణ్ కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని సమితి చైర్మన్ ఎం.శ్రీధర్ బాబు, వైస్ చైర్మన్ కె.సత్యనారాయణ్, అధ్యక్షుడు టి.జితేందర్ సింగ్, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణ, కోశాధికారి నిమేష్ సింగ్ అన్నారు. శుక్రవారం ధూల్‌పేట్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పురానాపూల్ రహీ ంపురా డాక్టర్ అంబేడ్కర్ భవన్ ప్లే గ్రౌండ్‌లో జరిగే మాతారాణికా విశాల్ జాగరణ్ శనివారం రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుందని, ఇందులో ప్రత్యేక ఆకర్షణగా మా శక్తి యువ మండల్ భాగ్యనగర్ ప్రముఖ గాయకులు ఠాకూర్ రవిసింగ్, సుశ్రీ సాక్షి చోప్రా, రాజన్‌కుమార్, వేషధారణలు మౌంటీ నటరాజన్ అండ్ టీమ్, లంగర్ ప్రసాద్, చెప్పన్ భోగ్, ట్వింకలింగ్ లైటింగ్, అఖండ జ్యోతి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు ఎం.మహేష్, పి.రవీందర్ సింగ్, ఠాకూర్ విపిన్ రాజ్ సింగ్, ఉపాధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా, రాజన్‌కుమార్, సచిన్‌రాజ్ సింగ్, రోమి అరోరా, పి.రంజిత్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరి ఎస్.సందీప్ సింగ్, రాజు కత్రి, సహా కార్యదర్శులు మనోజ్, నితిన్, సంతోష్, సతీష్‌కుమార్, సదాశివ, కార్యవర్గ సభ్యులు అశోక్‌బాబు, టి.ఆశిష్‌రాజ్‌సింగ్, అక్షయ సింగ్, శ్రీను, అనిల్, ఆనంద్‌కుమార్, ప్రభాకర్, పి.అభిషేక్ సింగ్ పాల్గొన్నారు.

బుల్కాపూర్ నాలా పూడికతీత పనులు చేపట్టాలి



సయ్యద్‌నగర్‌లో పర్యటిస్తున్న బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

గోల్కొండ: అహ్మద్‌నగర్‌లోని బుల్కాపూర్ నాలా పూడికతీత పనులు చేపట్టాలని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ కోరారు. శుక్రవారం ఆయన బల్దియా కమిషనర్ ఆమ్రపాలితో కలిసి అహ్మద్‌నగర్ డివిజన్‌లోని సయ్యద్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బల్దియా కమిషనర్‌కు బుల్కాపూర్ నాలాను చూపించారు. ఈ నాలా కారణంగా స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా అహ్మద్‌నగర్ డివిజన్‌తో పాటు మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, మురాద్‌నగర్ తదితర ప్రాంతాల్లోని డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించాలని ఆయన అన్నారు. ప్రతినిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని ఆయన కమిషనర్ దృష్టికి తెచ్చారు. అంతేకాకుండా 90 రోజుల ప్రత్యేక సీవరేజ్ పథకంలో డ్రైనేజీ ఆధునీకరణ పనులు చేపట్టాలని ఆయన కోరారు.

మేరు కులస్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి



ఎంపీ మల్లురవితో పోల్కం శ్రీనివాస్ తదితరులు

అఫ్జల్‌గంజ్: మేరు కులస్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీకి లక్షలాది మంది మేరు కులస్తులు అండగా ఉండి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఎంపీ మల్లురవిని కలిసి మెమోరాండం అందజేశారు. 33 ఏళ్లుగా కాంగ్రెస్‌లో క్రమశిక్షణ గల నాయకుడిగా పనిచేస్తున్న తనకు మేరు కులస్తుల తరఫున కార్పొరేషన్ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, ఇతర నాయకులు వెన్ను శివకుమార్, పల్లాల నవీన్ కుమార్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీకి నిరంతరం సేవలందిస్తున్న పోల్కం శ్రీనివాస్‌కు చైర్మన్ పదవి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లేనిచో మేరు కులస్తులమంతా కలిసి చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాహుల్‌గాంధీని కలిసి మేరు కులస్తులకు న్యాయం జరగాలని వివరిస్తామన్నారు. మల్లురవి సానుకూలంగా స్పందించి సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి మేరు కులస్తులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.

రవీంద్రభారతిలో కవి సమ్మేళనం



కవి సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ పండుగ ఆటపాటలతో విశ్వవ్యాప్తమైందని తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజాల అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకొని కవయిత్రులతో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తొమ్మిది రోజుల పాటు జరిపే ఈ పండుగ వల్ల స్త్రీల మధ్య చక్కటి స్నేహభావం ఏర్పడుతుందన్నారు. అనంతరం సుమారు 50 మంది కవయిత్రులు బతుకమ్మపై నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలచారి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



టీపీసీసీ అధ్యక్షుడితో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కార్వాన్ నియోజకవర్గం ఏ-బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి వందల ఏళ్ల చరిత్ర ఉందని ప్రజల కష్ట సుఖాలు కాంగ్రెస్ పార్టీకి బాగా తెలుసు అని ఆయన అన్నారు. నగరాన్ని పర్యాటన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. అందుకే మూసీ సుందరీకరణతో పాటు ఎన్నో పథకాలు చేపట్టడం జరిగిందన్నారు. అయితే నగరాభివృద్ధి గిట్టని ప్రతిపక్షాలు మూసీ సుందరీకరణ పనులను అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

90 రోజుల స్పెషల్ డ్రైవ్ విజయవంతం చేయాలి



ఇంకుడు గుంతలో మట్టి పోస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

గోల్కొండ: జలమండలి వారు చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌ను హకీంపేట్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ముఖ్యంగా ప్రతినిత్యం పొంగుతున్న డ్రైనేజీలను గుర్తించాలన్నారు. కార్వాన్‌లోని అన్ని డివిజన్‌లలో ఈ స్పెషల్ డ్రైవ్‌ను పక్కాగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. డ్రైనేజీ పైప్‌లైన్లను మార్చి ఆ ప్రాంతపు డ్రైనేజీ పైప్‌లైన్ల సామర్థ్యాన్ని పెంచాలని ఆయన అన్నారు. కాంట్రాక్టర్లకు ముందుగానే ఆదేశాలు ఇచ్చి వాడే ముడి సరుకులు, పైప్‌లైన్లు, మ్యాన్‌హోల్స్ మూతలను పరిశీలించాలని నాణ్యతతో ఎప్పుడు కూడా రాజీపడవద్దని సూచించారు. జలమండలి అధికారులతో పాటు కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

'ఏటా రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ మాటేమిటి'



మాట్లాడుతున్న మన్నె శ్రీధర్

నాంపల్లి: రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని కాలికి బలపం కట్టుకుని తిరిగిన మంద్రకృష్ణ మాదిగ ఉద్యోగాల భర్తీ విషయంపై మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మన్నె శ్రీధర్ మండిపడ్డారు. శుక్రవారం లక్డీకాపూల్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఏటా భర్తీ చేస్తామన్న రెండు కోట్ల ఉద్యోగాల మాటేమిటని ప్రశ్నించారు. పదకొండేళ్లుగా నిరుద్యోగులను మోసం చేస్తూ వస్తోన్న బీజేపీపై మందకృష్ణమాదిగ ముందుగా మాట్లాడి, ఆ తర్వాతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అడిగితే బాగుంటుందని హితవు పలికారు. మోదీ ప్రభుత్వం కుల గణనను అడ్డుకోవడమే కాకుండా నిరుద్యోగుల జీవితాలతోనూ ఆడుకుంటోందని ధ్వజమెత్తారు. రాజ్యాంగ సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీలను విభజిస్తోందని విమర్శించారు. ప్రజా పాలనలో ప్రజా సంక్షేమం, పథకాలు, నిరుద్యోగుల సమస్యలకు పెద్దపీట వేయాలని కోరారు.

జూ చూసొద్దాం రండి..

విజ్ఞానంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్న జూ పార్కు

ఆన్‌లైన్ బుకింగ్‌తో జూ సందర్శన ఈజీ

నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు



నెహ్రూ జులాజికల్ పార్కు



ఎన్‌క్లోజర్‌లో హుషారుగా టైగర్



ఎన్‌క్లోజర్‌లో సరదాగా గడుపుతున్న కొంగలు

చార్మినార్: నెహ్రూ జులాజికల్ పార్కును సందర్శించడానికి చిన్నారులతో పాటు పెద్దలు సైతం ఇష్టపడతారు. కేవలం కాలక్షేపం కోసమే కాకుండా జంతు ప్రపంచం గురించి తెలుసుకునే విజ్ఞాన యాత్రగా జూ పార్కు సందర్శన ఉంటుంది. జూ పార్కును సందర్శించడానికి నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. జూ సందర్శనకు ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ అందుబాటులో ఉండడంతో సందర్శకులు ఎక్కడి నుంచైనా జూ సందర్శన టికెట్లను ముందుగానే బుక్ చేసుకోవచ్చు. నెహ్రూ జులాజికల్ పార్కు ఓ ఎంటర్‌టైన్‌మెంట్ పార్కుగా కాకుండా సందర్శకులకు ఆహ్లాదం, వినోదంతో పాటు జంతువు, పక్షులపై కొత్త విషయాలను నేర్చుకునే విద్యాలయంగా చెప్పవచ్చు. దీంతో జూ సందర్శకుల రద్దీ కూడా పెరిగింది. అప్పుడప్పుడు వచ్చే పాఠశాలలు, కళాశాలలకు సెలవులతో పాటు వీకెండ్ రోజులలో జూపార్కును సందర్శించే సందర్శకుల సంఖ్య అధికంగా ఉంటుంది. వేలాది మంది సందర్శకులకు జంతువులు, పక్షులపై ప్రత్యేక అవగాహనను జూపార్కు అధికారులు కల్పిస్తూ జూలో అనేక కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం కలిగిస్తున్నారు.

జూ సందర్శనకు పెరిగిన ఆసక్తి...

జూలో లేని జంతువు, పక్షులను రప్పించేందుకు, జంతువు, పక్షుల సంతానోత్పత్తి చేపట్టడం ప్రారంభించాక జూ సందర్శన పట్ల సందర్శకుల్లో అమితమైన ఆసక్తి పెరిగింది. అత్యంత విషతుల్యమైన పాములు, విషం లేని పాములను స్నేక్ సెల్ బృందం ప్రదర్శిస్తూ వాటి వివరాలను సందర్శకులకు తెలియజేస్తూ పాముల పట్ల సందర్శకులకు ఉన్న అపోహాలను తొలగిస్తున్నారు. ఇదే కాకుండా వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ వన్యప్రాణులను దత్తత తీసుకునే వెసులుబాటును కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లపై సందర్శకులను చైతన్యవంతులను చేస్తూ ప్లాస్టిక్ నివారణకు కృషి చేస్తున్నారు. సందర్శకులు రోజంతా ఉపశమనం పొందడమే కాకుండా ఆహ్వాదకరమైన చల్లని వాతావరణాన్ని ఆస్వాదిస్తూ వన్య ప్రాణులను తిలకించడమే కాకుండా అనేక విషయాలను తెలుసుకోవడం లాంటి అనుభూతులను జూను సందర్శిస్తే కాని తెలియదు.



జూలో ఆకట్టుకుంటున్న గ్రీనరీ

జూపార్కులో సౌకర్యాలు..

జూపార్కును అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతరించిపోయే జంతువు, పక్షుల సంతానోత్పత్తిని చేపట్టేందుకు జూపార్కు కేంద్ర బిందువుగా ఉంది. చిన్నారులు ఆడుకునేందుకు చిల్డ్రన్స్ పార్కు, సేద తీరేందుకు పచ్చిక బయళ్లు, రచ్చబండలు, సహపంక్తి భోజనాలు చేసేందుకు పచ్చని తోరణాలతో విచ్చుకున్న పచ్చదనం జూపార్కు అందచందాలను తిలకించేందుకు విజిటర్ వ్యాన్, లయన్ సఫారీ, చిట్టి రైలు అందుబాటులో ఉన్నాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గోల్కొండ: చెట్ల కొమ్మలను తొలగింపు, కొత్త విద్యుత్ కనెక్షన్‌లను ఇస్తున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటలో పేర్కొన్నారు. లంగర్‌హౌస్ సబ్‌స్టేషన్ పరిధిలోని మారుతీనగర్ ఫీడర్ పరిధిలోని మారుతీనగర్, ఓంనగర్‌లలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు. టోలిచౌకీ సబ్‌స్టేషన్ బీఎస్ఎన్ఎల్ ఫీడర్ పరిధిలోని మెరాజ్ కాలనీ, ఐఏఎస్ కాలనీ, చోటా జానకీనగర్, పారమౌంట్ కాలనీ, బక్తావర్‌గూడా, ఎంసీహెచ్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 4.30 వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఆదిత్య టవర్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని బృందావన్ కాలనీ, తబ్జా కాలనీ, రిలయన్స్ మార్ట్, డిలక్స్ కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు. ఇంద్రానగర్, దోభీఘాట్, గాంధీబొమ్మ, టోటల్ గ్యాస్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

'డిజిటల్ కార్డులతో ప్రజలకు ఎంతో ప్రయోజనం'



అబిడ్స్: డిజిటల్ కార్డులో ప్రజలకు ఎంతో ప్రయోజనం ఉంటుందని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. హిందీనగర్‌లో డిజిటల్ కార్డుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఈ కార్డులను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతిఒక్క కుటుంబం ఈ కార్డులను తీసుకొని పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు ప్రాంతాల్లో నిర్మల్‌కుమార్ యాదవ్ పర్యటించి డిజిటల్ కార్డుల గురించి వివరించారు.

నేటి నుంచి ప్రత్యేక బస్సులు

సంతోష్‌నగర్: దసరా పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఈనెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నడపనున్నట్లు హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) వి.సుచరిత తెలిపారు. దసరా పండుగను పురస్కరించుకొని ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, సంతోష్‌నగర్, ఉప్పల్ నుంచి విజయవాడ, కోదాడ, సూర్యాపేట, నల్గొండ, మిర్యాలగూడ, ఖమ్మం, ఆమన్‌గల్, కల్వకుర్తి, చింతపల్లి, మాల్, వరంగల్, హన్మకొండ, భువనగిరి తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులను నడపనున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత



లంగర్‌హౌస్: ఇంటి ముందు ఆడుకుంటు తప్పిపోయిన చిన్నారులను పోలీసులు వెతికి పట్టుకొని కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం..డిఫెన్స్ కాలనీలో నివాసముండే వ్యాపారి షేక్ అహ్మద్ కుమారులు షేక్ జయాన్(3), షేక్ జోహాన్(3)లు వారి బంధువు షేక్ మౌలా కుమారుడు షేక్ అలియాన్(4)తో కలిసి శుక్రవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఇంటి ముందు ఆడుకుంటున్నారు. వారు కనిపించకపోవడంతో పక్కనే మెహదీ కాలనీలో ఉన్న అలియాన్, షేక్ మౌలా వాళ్ల ఇంటికి వెళ్లారనుకున్నారు. షేక్ మౌలా ఫోన్ చేసి అహ్మద్‌ను తన కుమారుని కోసం వాకబు చేయగా పిల్లలు కనిపించడంలేదని అర్థం చేసుకొని లంగర్‌హౌస్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్, ఎస్సై రాఘవేంద్ర స్వామి బృందాలుగా ఏర్పడి సీసీ కెమరాల పుటేజీలతో పాటు వివిధ ప్రాంతాల్లో వెతికారు. పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 102 వద్ద ఉన్న ఒక వీధిలో కనిపించిన చిన్నారులను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబీకులకు అప్పగించారు.

గంజాయి తాగుతున్న ఇద్దరికి జైలు

గౌలిపురా: గంజాయి తాగుస్తున్న ఇద్దరికి 7 రోజుల జైలు శిక్ష పడిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం ..మీర్‌చౌక్ ప్రాంతానికి చెందిన డ్రైవర్ మహ్మద్ ముస్తాఫా (44), తలాబ్‌కట్టా నషేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ యాసిన్ ఖురేషి (35)లు ఇటీవల భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో వారిద్దరిపై కేసు నమోదు చేసుకొని శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు ఇద్దరికి 7 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

సాయిబాబాచారికి సన్మానం



గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడిగా పని చేస్తూ వృత్తిపని వారికి గుర్తింపు తెచ్చిన ఘనత సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారికే చెందుతుందని వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన టి.శివశంకర్ అన్నారు. సాయిబాబాచారి సేవలకు గుర్తింపుగా శుక్రవారం ఆయనను శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ.. అమ్మవారికి వంశపార్యపర్యంగా దశాబ్దాలుగా వృత్తిపని వారు సేవలు అందిస్తున్నారన్నారు. సాయిబాబాచారి సలహాలు, సూచనలు రాజు వస్తాద్ ఆశీస్సులతో అందరిని కలుపుకుంటూ ముందుకు సాగుతానని ఆయన అన్నారు. వృత్తిపని వారికి అండగా ఉంటూ గుర్తింపు రావడంలో బి.శ్రీకాంత్‌చారి కూడా ప్రధాన పాత్ర పోషించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌రావు, మహేష్, మహేందర్ తదితరులున్నారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు సత్కారం



డాక్టర్ నరహరి, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

నాంపల్లి: నూతనంగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలకు పలువురు ప్రభుత్వ వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరహరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ రవూఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ శివరాం నాయక్, డాక్టర్ సంతోష్ చారి, డాక్టర్ షబ్బీర్ ఉన్నారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రామాయణ్ మేళా



వేడుకల్లో జస్మంత్‌భాయ్ పటేల్, బ్రిజ్‌గోపాల్ తదితరులు

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రామాయణ మేళా జోరుగా నిర్వహించారు. ఎగ్జిబిషన్ సొసైటీ రాజస్థానీ ప్రగతి సమాజ్‌ల ఆధ్వర్యంలో వేడుకలు కొనసాగుతున్నాయి. ఈ నెల 12వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహిస్తారు. జస్మత్‌భాయ్ పటేల్, బ్రిజ్‌గోపాల్, గోవింద్‌రాఠి, కె.నిరంజన్, సురేందర్ రెడ్డి, సుమిత్‌రాఠి, దీపం ముట్టేసి వేడుకల్లో పాల్గొన్నారు. రామాయణంపై అవగాహన, రామాయణ పఠనం చేపట్టారు. పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠి వెల్లడించారు.

చిన్నారులకు ఆటల పోటీలు



లంగర్‌హౌస్: దసరాను పురస్కరించుకొని చిన్నారులకు ఆటల పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు బోగి బాలరాజ్ ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మైదానంలో ప్రారంభించారు. అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మూసీవాసులకు అండగా ఉంటాం'



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు అండగా ఉంటామని నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం దేవీనగర్, ఉప్పలమ్మ బస్తీ, పురానాపూల్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..మూసీ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు పేదవారిని భయపెట్టిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా ఉండి వారి ఇండ్లు ఎక్కడ పోకుండా చూసుకుంటామన్నారు.

భారీ వర్షం..రోడ్లు జలమయం



దత్తనగర్ రోడ్డులో..

నాంపల్లి: శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. నాంపల్లి నియోజకవర్గంలోని మల్లేపల్లి, ఆసిఫ్‌నగర్, కుమ్మరవాడి, దత్తాత్రేయనగర్ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లను వరద నీరు ముంచెత్తడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఎక్కడికక్కడే వాహనాలు స్తంభించిపోయాయి. వర్షం రావడం, వరద నీరు రోడ్లపైకి, ఇండ్లలోకి రావడం పరిపాటిగా మారిపోయింది.

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి ఆవరణలో..



గోల్కొండ మహిళా గంజ్‌లో..



సునార్‌గల్లీలో పూజలు చేస్తున్న సాయి గౌడ్, జగదీష్‌గౌడ్, రాజసేనా చారి



షేక్‌పేట్ సీతారామాంజనేయ ఆలయంలో..



ఉప్పుగూడలో..



మీరాలంమండిలో ..



జియాగూడ మహంకాళి అమ్మవారు



గుడిమల్కాపూర్‌లో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రెండవ రోజు అమ్మవారిని గాయత్రీ దేవీగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం



పూజల్లో బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, సత్యనారాయణ, శివ



గోల్కొండ బంజారి దర్వాజ వద్ద..



మీరాలంమండిలో సామూహిక కుంకుమార్చన